

పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా టాప్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: సెప్టెంబరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో 99.47 శాతంతో జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో 2,42,583 లబ్ధిదారులకుగాను 2,41,293 మందికి పంపిణీ చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. గత ఆగస్టు నెలలో కూడా పింఛన్ల పంపిణీలో 98.03 శాతంతో రాష్ట్రంలోనే టాప్‌లో నిలిచింది. కలెక్టర్ ఆదేశాల మేరకు డెత్ కేసులు తీసేయడం, లబ్ధిదారులకు ముందుగా సమాచారం అందించడం, ముందస్తుగా అధికారుల నియామకం వంటి అంశాలతో పింఛన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

ఇసుక బాధలు..

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: ఇసుక స్టాక్ యార్డుల వద్ద రద్దీని కట్టడి చేసేందుకు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితం ఇవ్వడం లేదు. స్టాక్ యార్డుల వద్ద నుంచి బుకింగ్‌లను తీసేసి జిల్లాలో రెండు చోట్ల ఏర్పాటు చేసినప్పటికీ.. వాటి వద్ద కూడా అదే పరిస్థితి. క్యూలైన్ల నిర్వహణలో అధికార యంత్రాంగం చేతులెత్తేసింది. దీని వలన వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ముందు ఎవరూ ముందున్నారనేది నిర్ధారణ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సమస్యను సులభతరం చేసేందుకు కనీసం నియోజకవర్గానికి ఒకటి, వీలైతే అన్ని మండలాల్లో బుకింగ్ ఆఫీసులు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమౌతోంది. రాబోయే రోజుల్లో ఇసుక రీచ్‌లు మరిన్ని ప్రారంభమయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం సత్వరమే దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. జిల్లాలోని 26 మండలాలకు కలిపి సీ. బెళగల్ మండలంలోని కొత్తకోట, సింగవరం, ఈర్లదిన్నె, ముడుమాల, పల్‌దొడ్డి రీచ్‌ల్లో దాదాపు 3.87 లక్షల టన్నుల ఇసుక గుర్తించారు. గతనెల 29 నుంచి బుకింగ్ సిస్టం ద్వారా జిల్లా కేంద్రంలోని గనుల శాఖ, సీ. బెళగల్‌లోని తహసీల్దార్ కార్యాలంయలో బుకింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ నిల్వలు ఖాళీ అవుతుండటంతో కోసిగి మండలంలోని మరో 3 గ్రామాల్లో 3 లక్షల టన్నుల ఇసుక తవ్వకాల కోసం పర్యావరణ అనుమతిని గనుల శాఖ కోరింది. అయితే రీచ్‌ల వద్ద స్థానికుల పెత్తనం ఎక్కువైందన్న ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులతో చర్చించి కొంత వికేంద్రీకరించారు. ఈ క్రమంలో ఇసుక బుకింగ్ కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బుకింగ్ చేసుకున్న వారికి స్టాక్ కేటాయించి ఆ సమయంలో మాత్రమే లారీలను స్టాక్ యార్డు వద్దకు అనుమతిస్తున్నారు. రోజుకు 600 లారీల వరకు డిమాండ్ ఉంది. కాగా ప్రస్తుతం ఈ రెండు చోట్ల రద్దీ పెరిగిపోయింది. ముఖ్యంగా సీ. బెళగల్‌తో పాటు జిల్లా కేంద్రంలోని గనుల శాఖ కార్యాలయానికి వందల సంఖ్యలో లారీ డ్రైవర్లు చేరుకొని వరుసలో నిలుచుంటున్నారు. కొంత మంది అలస్యంగా వచ్చినప్పటికీ.. వారికి తెలిసిన వాళ్లు ఉండడంతో ముందు వరుసలో చేరుతున్నారు. దీని వలన గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయంలో బుకింగ్ చేసుకుంటే వికేంద్రీకరణ జరిగి రద్దీ తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమౌతుంది. మండలాల వారిగా ప్లాన్ చేసుకొని కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూం పర్యవేక్షణ జరిపితే ఇసుక బుకింగ్ ఆఫీసుల్లో నెలకొన్న రద్దీ తగ్గిపోయి ప్రజలకు బాధలు తప్పుతాయి. అంతే కాకుండా ఏ రోజు బుకింగ్ చేసుకున్న వారికి ఆ రోజే డెలివరీ జరిపితే సమస్యలు ఉత్పన్నం కావనే అభిప్రాయం ఉంది. ప్రస్తుతం వందల సంఖ్యలో బుకింగ్స్ పెండింగ్‌లో ఉన్నాయని గనుల శాఖ అధికారుల రికార్డులు సూచిస్తున్నాయి.



జిల్లా గనులు, భూగర్భ శాఖ కార్యాలయం వద్ద ఇసుక కోసం బారులుదీరిన వినియోగదారులు

- 26 మండలాలకు 2 ఇసుక బుకింగ్ ఆఫీసులు
- క్యూలైన్ల వద్ద తీవ్ర రద్దీ.. బారులు తీరుతున్న వైనం
- పెరుగుతున్న మరిన్ని రీచ్‌ల అవసరం



కార్యాలయం ఎదుట ఉచిత ఇసుక, రవాణా చార్జీలకు సంబంధించి ఏర్పాటు చేసిన సమాచార ఫ్లెక్సీలు



బుకింగ్ కేంద్రం వద్ద వినియోగదారులు, పోలీసులు

నీటిపాలు

- 3.62 లక్షల హెక్టార్ల పంటను ముంచెత్తిన వాన
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు

కర్నూలు (అగ్రికల్చర్), సెప్టెంబరు 2: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు పంటలన్నీ నీటమునిగాయి. మరో నాలుగైదు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు భారీ నష్టం జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నాయి. బంగాళాఖాతంలో వాయుగుండం వల్ల సోమవారం కూడా జిల్లాలో వర్షాలు కురిసాయి. కర్నూలు రూరల్‌లో 7.4 ఎంఎం, మద్దికెరలో 7.2, కర్నూలు అర్బన్‌లో 7 ఎంఎం, కల్లూరు 6.6 ఎంఎం, మంత్రాలయంలో 5.4, చిప్పగిరిలో 5ఎంఎం, సి. బెళగల్‌లో 4.6, హాలహర్విలో 4.6, హొళగుందలో 4.2, ఆదోనిలో 3.5, తుగ్గలిలో 3.6, ఎమ్మిగనూరులో 3.2, నందవరంలో 3.2 మిగిలిన మండలాల్లో 1 నుంచి 2 ఎంఎం వర్షం నమోదైంది. జిల్లా అంతటా సగటున 3.4 ఎంఎం వర్షపాతం నమోదైంది. కేవలం ఆది, సోమవారాల్లో కురిసిన వర్షం 13.3 ఎంఎంగా నమోదైంది. సెప్టెంబరులో నెలాఖరు వరకు కురవాల్సిన వర్షం 116.5 ఎంఎం కాగా.. ఈ రెండు రోజుల్లోనే 13.3 ఎంఎం వర్షం నమోదైంది. ఇప్పటిదాకా కర్నూలు జిల్లాలో రైతులు 3,62,195 హెక్టార్లు (86.40 శాతం) సాగు చేస్తే, దాదాపు 90 శాతం పంటలు నీట మునిగాయి. ఇందులో పత్తి పంట 2,26,071 హెక్టార్లలో సాగైంది. మరో నెల రోజుల్లో ఈ పంట రైతుల చేతికి అందే అవకాశం ఉండగానే.. ప్రస్తుత వర్షాలకు పైరంతా నీటిలోనే మునిగిపోయి ఉంది. అదే విధంగా వేరుశనగ 44,803 హెక్టార్లు, వరి 5,296 హెక్టార్లు, సజ్జ 5,488 హెక్టార్లు, మొక్కజొన్న 3,956 హెక్టార్లు, కొర్ర 5,431 హెక్టార్లు, కందులు 42,462 హెక్టార్లు, ఆముదం 10,147 హెక్టార్లు, పొగాకు 1,933 హెక్టార్లు, మిరప 23,437 హెక్టార్లు, ఉల్లి 10,903 హెక్టార్లు, టమోటా 1,448 హెక్టార్లు సాగయ్యాయి. ఇందులో 90 శాతం నీట మునిగిపోయాయి.

- **కదలని వ్యవసాయాధికారులు:** కర్నూలు జిల్లాలో వర్షాలకు పంటలన్నీ మునిగిపోయినా వ్యవసాయ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు, కింది స్థాయి సిబ్బంది, రైతు సలహా మండలి కార్యాలయాల్లో ఉన్న సిబ్బందికి పొలాలకు వెళ్లి రైతులకు తగు సూచనలు ఇవ్వమని చెప్పడంతో పైఅధికారులు తమ తమ పని అయిపోయిందన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా మండల వ్యవసాయాధికారులు, ఏడీఏలు, ఇతర శాస్త్రవేత్తలు కేవలం పేపరు ప్రకటనలకే పరిమితం కాకుండా పొలాల వద్దకు వచ్చి వాస్తవ పరిస్థితులు గ్రహించాలని రైతులు కోరుతున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి నీట మునిగిన మొక్కజొన్న పంట

అప్రమత్తంగా ఉండండి

- వర్షాలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, సెప్టెంబరు 2: నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నాయనీ.. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే గౌరు చరిత ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో భారీ వర్షాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామాల్లో ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రపరచాలన్నారు. డ్రైనేజీల్లో మురుగు తొలగించి బ్లీచింగ్ పౌడర్, వేస్టాయిల్ చల్లించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో జరిగిన పంటనష్టంపై నివేదికలు తయారు చేసి పంపాలని ఏవో సుధాకర్‌ను ఆమె ఆదేశించారు. లొద్దిపల్లె బీసీ వసతి గృహంలో గదులు క్రాక్ ఇవ్వడంతో విద్యార్థులను మరోచోటకు వసతులు కల్పించామని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో శివనాగప్రసాద్, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, ఏఈలు రామయ్య, రామసుబ్బారెడ్డి, ఎస్ఐ సునీల్ కుమార్, నాయకులు విశ్వేశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, సుధాకర్‌రావు, మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రామభూపాల్ రెడ్డి, వెంకటరమణ, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

జగన్‌వి నీచ రాజకీయాలు

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: విజయవాడలో వరదప్రాంతాల్లో చంద్రబాబు పర్యటిస్తూ ఆదుకుంటుంటే జగన్ మాత్రం నీచరాజకీయాలకు పాల్పడుతున్నాడని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓవైపు వర్షాలతో నదులన్నీ నీటితో పోటెత్తి ప్రజా జీవనం అస్తవ్యస్తమైంది. ప్రజలకు అండగా నిలవాల్సిందిపోయి సేవా కార్యక్రమాలపై దుమ్మెత్తి పోయడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. సీఎంగా చంద్రబాబు నాయుడు క్షణం ఆలస్యం చేయకుండా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ వారిని కలుసుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవిశ్రాంతంగా పోరాడుతున్నాడన్నారు. రాత్రి అంతా అధికారులు, ఉద్యోగులతో కలిసి బాధితులకు ఆహారం, సౌకర్యాలు కల్పిస్తూ ఆదుకుంటున్న వైనం చూసి జగన్‌రెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. గత ఐదేళ్ల కాలంలో తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రంలో చెరువులు, నదులకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయడం లేదన్నారు. ఆ నిర్లక్ష్యం వల్లే నేడు వరదలకు దారి తీసిందన్నారు. ఇప్పటికైనా జగన్, వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నాలను మాను కోవాలన్నారు.

96 ఫిర్యాదులు

- క్యాంపు కార్యాలయంలో పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక
- చట్టపరంగా న్యాయం చేస్తాం
- ఎస్పీ జి.బిందు మాధవ్

కర్నూలు, సెప్టెంబరు 2: స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 96 ఫిర్యాదులు వచ్చాయి.

- కర్నూలు సచివాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు తాండ్రపాడుకు చెందిన మహేశ్వరరెడ్డి అనే వ్యక్తి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని తుగ్గలి మండలం మారెల్ల గ్రామానికి చెందిన లక్ష్మన్న ఫిర్యాదు చేశారు.
- మధుబాబు అను వ్యక్తి తమ పొలాన్ని ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేశాడని కోడుమూరు మండలం కొండపేటకు చెందిన కాశీంసాహెబ్ ఫిర్యాదు చేశారు.
- తన కుమారుడు ఇబ్బందులకు గురి చేస్తున్నాడని, చర్యలు తీసుకోవాలని కర్నూలుకు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- తమ అనుమతి లేకుండా, నోటీసు ఇవ్వకుండా పూర్వీకుల నుంచి ఉన్న పశువుల పాక రాతిగోడను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆస్పరి మండలం కారుమంచి గ్రామానికి చెందిన తిక్క నాగప్ప ఫిర్యాదు చేశారు.
- తమ 3 ఎకరాలలో సాగు చేసిన కంది పంటను గొర్రెలతో మేపి పంట నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కర్నూలు స్టాంటన్‌పురానికి చెందిన ఆనంద్ కుమార్ ఫిర్యాదు చేశారు.
- లక్ష్మీపురం గ్రామ శివారులోని 2 ఎకరాల 76 సెంట్ల భూమిని సర్వేయర్ కొలిచి హద్దులు పాతితే.. పక్క పొలం వారు హద్దులు జరిపి గొడవలు సృష్టిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డోన్‌కు చెందిన నవీన్ కుమార్ ఫిర్యాదు చేశారు.
- తన భర్త, అత్త కలిసి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని, వారితో పిల్లలకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కర్నూలు బుధవారపేటకు చెందిన పార్వతి ఫిర్యాదు చేశారు.
- విత్తనం వేసిన పొలాన్ని దౌర్జన్యంగా ట్రాక్టర్‌తో దున్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని సి. బెళగల్ చెందిన గోవిందమ్మ ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేస్తామని ఎస్పీ జి. బిందుమాధవ్ హామీ ఇచ్చారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జి.బిందు మాధవ్

సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి. నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీల పరిష్కారం పురోగతిపై సమీక్షించారు. పీజీఆర్ఎస్‌కు సంబంధించి గడువు దాటిన అర్జీలు జీరో ఉన్నాయన్నారు. అదే విధంగా రీఓపెన్, సీఎం గ్రీవెన్స్‌లపై కూడా దృష్టి పెట్టాలన్నారు. రీ ఓపెన్ కేసులపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. ఓపెన్ కాకుండా అర్జీల పరిష్కారంపై ఎండార్స్‌మెంట్ స్పష్టంగా ఇవ్వాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చే దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. వసతి గృహాల తనిఖీ నివేదికను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హిందూధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

- శ్రీమఠాల పీఠాధిపతులు

మంత్రాలయం, సెప్టెంబరు 2: సనాతన హిందూ ధర్మాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని శ్రీమఠాల పీఠాధిపతులు పిలుపునిచ్చారు. సోమవారం నూతనంగా నిర్మించిన గురు నివాస్ భవన్‌లో శిష్య విద్వాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, బాలాఘర్ మఠం పీఠాధిపతి అక్షోభ్య రామప్రియతీర్థులు, వ్యాసరాజమఠం పీఠాధిపతి విద్యామనోహర్ తీర్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పంచాంగం, ధర్మశాస్త్రం వంటి అంశాలపై చర్చించారు. సనాతన హిందూ ధర్మాలను సంరక్షించుకుంటూ సంస్కృత విద్యావ్యాప్తికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంచాంగ రచనలో పొరపాట్లు జరగరాదని గుర్తు చేశారు. ధర్మశాస్త్రాలు అందరికీ అర్థవంతమైన రీతిలో సరళంగా ఉండాలన్నారు. అనంతరం ఆయా మఠాల పీఠాధిపతులు పండితులను, శిష్యులను, సంస్కృత పాఠశాల విద్యార్థులను ఫలపుష్ప మంత్రాక్షింతలు, శేష వస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ప్రిన్సిపాల్ వాదిరాజాచార్, వెంకటేషాచార్, హనుమేష్‌చార్ పాల్గొన్నారు.



పండితుల సమావేశంలో మాట్లాడుతున్న ముగ్గురు పీఠాధిపతులు

వంద టీఎంసీలకు చేరువలో తుంగభద్ర

- 98.961 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- డ్యాంకు చేరుతున్న 37,100 క్యూసెక్కులు


నిండుకుండలా కనిపిస్తున్న తుంగభద్ర డ్యాం

కర్నూలు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం వంద టీఎంసీలకు చేరువలో ఉంది. సోమవారం రాత్రి 9 గంటల నీటి లెక్కలు ప్రకారం జలాశయంలో 98.961 టీఎంసీలు నీటి నిల్వ చేరింది. 37,100 క్యూసెక్కుకులు వరద వచ్చి చేరుతోంది. మంగళవారం ఉదయానికి వంద టీఎంసీలు దాటుతుందని తుంగభద్ర ప్రాజెక్టు ఇంజనీర్లు అంచనా వేశారు. ఆగస్టు 10న డ్యాం గేట్ల దింపుతుండగా 19వ నంబరు గేటు చైన్‌లింగ్ తెగిపోయి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ఆ సమయంలో డ్యాంలో 105.788 టీఎంసీలు నిల్వ ఉంది. కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాగ్ ఏర్పాటు చేయాలంటే క్రస్ట్ లెవల్ 1,613 అడుగుల లెవల్ వరకు డ్యాంను ఖాళీ చేయక తప్పదని టీబీ బోర్డు ఇంజనీర్లు భావించారు. క్రస్ట్ లెవల్‌లో 43 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంటుంది. అంటే 62.788 టీఎంసీలు వదిలేయాల్సి వచ్చింది. అదే జరిగి ఉంటే నిత్యం కరువుతో తల్లడిల్లే రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాల ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చేది. ఆ సమయంలో క్రస్టుగేట్ల నిపుణుడు ఎన్.కన్నయ్యనాయుడును సీఎం చంద్రబాబు రంగంలోకి దింపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు టీబీ ప్రాజెక్టుకు చేరుకున్న కన్నయ్యనాయుడు బోర్డు ఇంజనీర్లతో చర్చించారు. 72 టీఎంసీలు నీటి నిల్వ కుండగానే స్టాప్‌లాక్ ఎలిమెంట్ సెగ్మెంట్లు దిగ్విజయంగా అమర్చారు. సుమారు 30 టీఎంసీలు కడలిపాలు కాకుండా కాపాడి రైతుల్లో సాగు భరోసా కల్పించారు. ఆ రోజు నుంచి డ్యాంకు రోజు సగటున 25-30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతూ వచ్చింది. తాజాగా 98.961 టీఎంసీలకు చేరింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో 26,272 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.ఎగువన కురుస్తున్న వర్షాలకు క్రమక్రమంగా వరద పెరుగుతూ వస్తోంది. రాత్రి 9 గంటలకు 37,100 క్యూసెక్కులకు చేరింది. అంటే సరాసరి 3 టీఎంసీలు వచ్చి చేరుతోంది. వివిధ కాలువలు, విద్యుత్ ఉత్పత్తి కోసం 15,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఇదే వరద ఇలాగే కొనసాగితే బుధవారం సాయంత్రంలో గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు, టీబీపీ బోర్డు అధికారులు సకాలంలో స్పందించడంతో గేటు కొట్టుకుపోయినా.. ఖరీఫ్, రబీ సాగుతో పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేశారు.

సాగు ఆశలు పదిలం

ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులు చంద్రబాబు, సిద్దరామయ్య సహా క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, టీబీపీ బోర్డు అధికారులు సకాలంలో స్పందించడం వల్ల ఖరీఫ్, రబీ సాగుతో పాటు తాగునీటికి తీరిన ట్లుఅయింది. రాయలసీమ జిల్లాలు కర్నూలు, అనంతపురం, కడప ప్రాంతాలకు చెందిన తుంగభద్ర కుడి దిగువ కాలువ (ఎల్లెల్సీ), ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1.57 లక్షల ఎకరాలక సాగునీరు ఇవ్వాలి. ఈ ఏడాది ఖరీఫ్‌లో 35 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని ఐఏబీలో తీర్మానం చేశారు. అనంతపురం, కడప జిల్లాల్లో హెచ్చెల్సీ కింద 1.90 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. రైతులు వరినాట్లలో బీజీగా ఉన్న సమయంలో ఈ నెల 10న తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు కొట్టుకుపోవడంతో సాగు మాట ఎలా ఉన్నా రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని ఆందోళన చెందారు. కష్ట సమయంలో ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు సూచన మేరకు క్రస్ట్‌గేట్ల నిపుణుడు ఎన్.కన్నయ్యనాయుడు రంగంలోకి దిగి స్టాప్‌లాగ్ ఎలిమెంట్ సెగ్మెంట్లను సకాలంలో ఏర్పాటు చేయడం కరువు రైతుల సాగు ఆశలు పదిలం చేశారు.


తుంగభద్ర డ్యాం

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి
కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 2: జిల్లా కేంద్రంలో పీజీఆర్ఎస్ వ్యవస్థను పటిష్టం చేశామని, ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచిఅర్జీలను స్వీకరించారు. మొత్తం 76 అర్జీలు వచ్చినట్లు డీఆర్వో పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమామహేశ్వరి తెలిపారు.

పారా మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: 2024-25 విద్యాసంవత్సరం పారా మెడికల్ కోర్సులకు అడ్మిషన్ కౌన్సెలింగ్ సోమవారం పూర్తి చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ వెల్లడించారు. సోమవారం కాలేజీలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్‌కు వందలాది మంది హాజరు కాగా 121 మందికి అడ్మిషన్ ఇచ్చినట్లు తెలిపారు. పారా మెడికల్ కోర్సులకు సంబంధించి పది కోర్సుల సీట్లను మెరిట్, రోస్టర్ ప్రకారం భర్తీ చేశామన్నారు. కోర్సుల్లో సీట్లు పొందని విద్యార్థులు ఏ కారణం చేతనైనా ఫీజు చెల్లించకపోతే సదరు సీట్లను ఈ నెల 9వ తేదీన జరిగే రెండో కౌన్సెలింగ్‌లో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో వైస్ ప్రిన్సిపాల్స్ హరిచరణ్, సాయిసుధీర్, మెడికల్ కాలేజీ ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో లక్ష్మీప్రసన్న, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు మృతి


బాలమ్మ (ఫైల్)

తుగ్గలి, సెప్టెంబరు 2: ఏటా పంటలు సాగు చేసి అతివృష్టి, అనావృష్టి వల్ల అప్పులపాలై తీవ్ర మనోవ్యథతో రామవత్ బాలమ్మ (42) అనే మహిళా రైతు గుండెపోటుతో మృతి చెందింది. తుగ్గలి మండలంలోని జాప్లాతండాకు చెందిన మహిళా రైతు రమావత్ బాలమ్మ సోమవారం ఉదయాన్నే పొలానికి వెళ్లి .. మిరప, టమోటా పంట వర్షానికి కుళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆమె ఇంటికి వచ్చి గుండెపోటుతో కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు గుత్తి ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు అప్పటికే మృతి చెందిందని తెలిపారు. కుటుంబ పోషణ కోసం తనకున్న రెండెకరాలు పంటతో పాటు మరో మూడెకరాలు కౌలుకు తీసుకుని మిరప, టమోటా, కంది, సజ్జ పంటలను బాలమ్మ సాగు చేసింది. గత ఐదేళ్ల నుంచి ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట చేతికి రాక దాదాపు రూ.34 లక్షలు అప్పులయ్యాయి. దీంతో గుండెపోటు వచ్చి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త వెంకటేశ్‌నాయక్, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు వెంకటస్వామి, చంద్రశేఖర్‌యాదవ్, జడ్పీటీసీ పులికొండ నాయక్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణ నాయక్, టూకే నాయక్, లాలూ నాయక్, వెంకటేశ్ నాయక్ ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పి.కోటకొండలో...


గిడ్డయ్య (ఫైల్)

దేవనకొండ, సెప్టెంబరు 2 : అప్పుల భారంతో మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన మునగాల గిడ్డయ్య (31) పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మునగాల గిడ్డయ్య తనకున్న పొలంలో బోర్లు వేసి, మరికొంత పొలాన్ని కౌలుకు సాగు చేసేవాడు. పంటలు పండకపోవడంతో రూ.6 లక్షల దాకా అప్పులు పెరిగాయి. అప్పులు తీర్చే మార్గం కనపడక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య జయసుధ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు, సెప్టెంబరు 2: నగరంలో జోన్ రహదారిలో ఐటీసీ కూడలి ఫ్లైఓవర్ సమీపంలో మోటారు సైకిల్ ఢీకొని శాంతమ్మ (55) అనే మహిళ దుర్మరణం చెందింది. షరీన్‌నగర్‌కు చెందిన ఈమె పలు ఇళ్లలో పని చేస్తూ జీవనం సాగిస్తుండేది. ఈమెకు భర్త, ఇద్దరు కొడుకులు సంతానం. సోమవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఐటీసీ కూడలి వద్ద ఫ్లైఓవర్ దాటేందుకు ప్రయత్నించగా.. వేగంగా వచ్చిన మోటారు సైకిల్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుడు వెల్దుర్తి మండలం చెందిన హరికుమార్‌గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 6వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 3,154 మందికి గాను 1,635 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అధికారులు తెలిపారు. పరీక్షల రీవాల్యుయేషన్ కోసం ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి
కలెక్టర్ రంజిత్ బాషా


జాబ్‌మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: నైపుణ్యాభివృద్ధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మంగళవారం బిర్లాగేటు వద్ద బిక్యాంపు పోస్టాఫీసులోని నాక్ సెంటర్‌లో జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఐదు ప్రైవేటు కంపెనీల్లో 350 ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. అదేవిధంగా ఆలూరులో కూడా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనాలనుకునే యువకులు తమ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి కర్నూలులో ప్రశాంత్ 81424 10410, మల్లికార్జున 90592 90821, ఆలూరులో వీరేష్ 90100 03132 నంబర్లను సంప్రదించాలన్నారు.

కిడ్నాప్ కేసులో ముగ్గురిపై రౌడీ షీట్

గూడూరు సెప్టెంబరు 2: గూడూరులో పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెలలో డమాం వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేసిన కేసులో బోయ కొండయ్య, గాండ్ల నరసింహుడు అలియాస్ మున్నా, కటిక మహబూబ్ బాషాపై రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్య మాట్లాడుతూ ఎస్పీ ఉత్తర్వుల మేరకు కిడ్నాప్ కేసులో ముగ్గురిపై రౌడీ షీట్ ఓపెన్ చేసామన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కూడా రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

పంటల దిగుబడిలో అధికారుల సూచనలు తీసుకోవాలి
శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి


మిరప పంటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

మద్దికెర, సెప్టెంబరు 2: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంటలకు ఆశిస్తున్న తెగుళ్ల చీడపీడల నివారణకు అధికారుల సూచనలు తీసుకోవాలని కృషి విజ్ఞాన శాస్త్రవేత్త ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. రాఘవేంద్ర చౌదరి తెలిపారు. సోమవారం మండలంలోని మద్దికెర, బీఎం పేట గ్రామాల్లో మిరప, పత్తి, కంది, సజ్జ, వేరుశనగ, వివిధ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ పత్తి పంట నీటి ముంపునకు గురైనప్పుడు, పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం, పడిపోవడం జరుగుతుందని అప్పుడు ఆ సమయంలో పొటాషియం, నైట్రేట్ యూరియాలో కలిసి వారంరోజుల వ్యవధిలో మార్చిమార్చి పిచికారి చేయాల న్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా పొటాష్ ఎరువుగా వేయాలన్నారు. మిరప పంటలో వర్షం నీరు నిల్వ ఉంటే నారుకుళ్లు, తెగుళ్లు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల మందులు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త సుజాత, మండల వ్యవసాయ శాఖ అధికారి ఉప్పర రవి, ఆర్‌బీకే ఇన్‌చార్జిలు వై. రాణి, ఎం.కవిత, ఎం.జాకీర్ హుశేన్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌గా కర్నూలు జట్టు కైవసం


గెలుపొందిన కర్నూలు క్రీడాకారులు

కోసిగి, సెప్టెంబరు 2: కోసిగి మండలంలోని డి. బెళగల్ గ్రామంలో విజేత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజుల నుంచి రాష్ట్ర స్థాయి అండర్-17 ల్యాక్రోస్ చాంపియన్ షిప్‌ను కర్నూలు జిల్లా జట్టు కైవసం చేసుకుంది. విజేతలకు షీల్డ్స్, మెడల్స్ సర్టిఫికెట్లను రాష్ట్ర ల్యాక్రోస్ క్రీడల అసోసియేషన్ అధ్యక్షుడు మునికృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి అందజేశారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చాటిన వారికి జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. అండర్-17 పోటీల్లో కర్నూలు జిల్లా చాంపియన్‌గా, రన్నర్‌గా ప్రకాశం జిల్లా, మూడో స్థానంలో విజయనగరం, నాలుగో స్థానంలో శ్రీకాకుళం జిల్లా జట్లు నిలిచాయి. ఈ పోటీలను నిర్వహించిన హై స్కూల్ పీడీ శివను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మరామయ్య, ఉప సర్పంచ్ పాండురంగ, సోల్మాన్ రాజు, ప్రభాకర్ రెడ్డి, ఉశేనీ, నాగరాజు, రాజశేఖర్ రెడ్డి, బసవరాజు, సీతారాముడు తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉరుకుంద పల్లకోత్సవం

తుంగభద్రలో త్రిశూల స్నానం


పల్లకోత్సవంలో పాల్గొన్న భక్తులు

కౌతాళం/కోసిగి, సెప్టెంబరు 2: ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణ మాస పల్లకోత్సవం చివరి సోమవారం వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున కోసిగి మండలం కందుకూరు వద్ద తుంగభద్ర నదిలో స్వామి వారికి జలాభిషేకం చేసిన తరువాత అక్కడి నుంచి ఉరుకుందకు తిప్పలదొడ్డి, కరణి, చిరుతాపల్లి, మల్లనహట్టి గ్రామాల మీదుగా ఉరుకుందకు పల్లకి చేరుకుంది. గ్రామ పొలిమేరకు పల్లకి చేరుకోవడంతో ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు ఆలయ అర్చకులతో కలసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. కర్ణాటక నుంచి వచ్చిన డప్పు కళాకారుల బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారి పల్లకి ఉత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఈ వేడుకల్లో ఈఓ పట్టెం గురుప్రసాద్, ఉత్సవ అధికారి పాండురంగారెడ్డి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోసిగి సీఐ అశోక్ కుమార్, కౌతాళం ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాలుజారి బావిలో పడి మహిళ మృతి
గౌడుగల్లులో ఘటన

కోసిగి, సెప్టెంబరు 2: అప్పటి వరకు పొలంలో ఉల్లిగడ్డలు తెంపుతూ ఉన్న మహిళ మహాదేవి మంచి నీరు తేవడానికి వ్యవసాయ బావిలో దిగి కాలుజారి పడిపోయి మృతి చెందింది. కోసిగి మండల పరిధిలోని గౌడుగల్లు గ్రామానికి చెందిన కిందింటి మహాదేవి (25) తన పొలంలో భర్త రామకృష్ణతో కలిసి కుమారులు మధు, ఆనంద్, కుమార్తె రోజాతో కలిసి ఉల్లి పంటను లోడింగ్ చేసే పనిలో ఉంటూ కూలీలకు తాగునీరు తేవడానికి వెళ్లి కాలుజారి పడి బావి లోపడి మృతి చెందింది. అరగంట గమనించిన కుటుంబసభ్యులు ఆమెను బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

నాపరాయి లారీ సీజ్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: బేతంచర్ల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న నాపరాయి లారీని సీజ్ చేసి రూ.40 వేలు జరిమాన వసూలు చేసినట్లు గనులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. సోమవారం ఉదయం నన్నూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీల్లో అక్రమంగా నాపరాయి తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని యజమానికి జరిమాన విధించామని తెలిపారు.

కల్లూరు వీఆర్వో మద్దిలేటి రిలీవ్

కల్లూరు, సెప్టెంబరు 2: కల్లూరు వీఆర్వో మద్దిలేటిని విధుల నుంచి రిలీవ్ చేసినట్లు తహసీల్దారు కె.ఆంజనేయులు సోమవారం తెలిపారు. అవినీతి అక్రమాలపై ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆయనపై ఇటీవల కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వీఆర్వో మద్దిలేటిని దేవనకొండ మండలం తెర్నేకల్-2 గ్రామానికి బదిలీ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కల్లూరు వీఆర్వో మద్దిలేటిని తహసీల్దారు రిలీవ్ చేశారు.

విజయవాడకు ఉమ్మడి జిల్లా పోలీసులు
బయల్దేరిన నంద్యాల, కర్నూలు ఎస్పీలు
వారితో పాటు మరో 240 మంది పోలీసులు

కర్నూలు, సెప్టెంబరు 2: విజయవాడలో వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్, అధిరాజ్ సింగ్ రాణాలు సోమవారం మధ్యాహ్నం నుంచి బయలుదేరి విజయవాడకు వెళ్లారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సహాయక చర్యల్లో పాల్గొనేందుకు కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలో నలుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, మరో 40 మంది ఎస్ఐలు, వంద మంది పైగా పోలీసు సిబ్బంది విజయవాడ వెళ్లారు. వరద సహాయక చర్యల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు
జిల్లా వైద్యాధికారి భాస్కర్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: భారీ వర్షాల నేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖలో అత్యవసర వైద్యం, విపత్తు కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్ (9849902411) వ్యవహరిస్తారన్నారు. సభ్యులుగా ఏపీడమాలజిస్టు జి.వేణుగోపాల్ యాదవ్ (9440084009), డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ ఏ.నూకరాజు (9849902419), అసిస్టెంట్ మలేరియా అధికారి సీహెచ్ చంద్రశేఖర్ రావు (9949494366), ఎంపీహెచ్ఈవో చలపతిరావు (7569792365), హెల్త్ సూపర్‌వైజర్ మోక్షేశ్వరుడు (8919190259) కమిటీలో ఉంటారన్నారు. ఆపదలో ఎవరికైనా అత్యావసర వైద్యం కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేస్తుందన్నారు.

తెగుళ్ళ నివారణకు పిచికారి చేయాలి

నంద్యాల టౌన్, సెప్టెంబరు 2 : జిల్లాలో ఎడతెరపి లేని వర్షాల వల్ల తెగుళ్లబారిన పడ్డ పంటలకు పిచికారీ చేయాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం జాన్సన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలంలో ముంపు నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించాలని అన్నారు. వర్షాలు తగ్గాక మూడు, నాలుగు రోజుల తరువాత వరుసల మధ్య భాగాన్ని గుంటికతో గానీ, గొర్రుతో గానీ సేద్యం చేయాలని సూచించారు. ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని, అలాగే 13:0:45, 19:19:19 మందులను 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని అన్నారు. డ్రోన్లను ఉపయోగించడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేసే అవకాశం ఉందని అన్నారు.

భర్త మృతిని జీర్ణించుకోలేక..
మహిళ ఆత్మహత్య

శిరివెళ్ల, సెప్టెంబరు 2 : భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన శిరివెళ్ల మండలం వనికెందిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జిలకర అశోక్ తిరుపతిలో జీవనం సాగిస్తుండేవాడు. ఐదు రోజుల కిందట అశోక్ గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన వనికెందిన్నెకు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. భర్త మరణాన్ని జీర్ణించుకోలేక.. తీవ్ర మనస్తాపానికి గురైన భార్య శాంతి(40) ఆదివారం అర్ధరాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వారం రోజుల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ మృతి చెందడంతో వారి కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శాంతి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి తల్లి కనక రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద


నిండుకుండలా కనిపిస్తున్న శ్రీశైలం జలాశయం

శ్రీశైలం, సెప్టెంబరు 2: శ్రీశైలం జలాశయానికి సోమవారం వరద ప్రవాహం భారీగా కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 3,20,805 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,479 క్యూసెక్కులు మొత్తం 3,25,284 వరద నీరు వస్తోంది. డ్యాం 10 క్రస్టుగేట్లను ఎత్తి 4,71,730 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. సోమవారం సాయంత్రం 7 గంటల సమయానికి జలాశయానికి 4,96,554 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.10 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.5133 టీఎంసీలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,903 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,882 క్యూసెక్కులు, డ్యాం క్రస్టుగేట్ల ద్వారా 4,71,730 క్యూసెక్కులు మొత్తం 5,39,515 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా విమలమ్మ


విమలమ్మకు ఆర్డర్స్‌ను అందజేస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సీనియర్ హెడ్ నర్సు జి.విమలమ్మ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా పదోన్నతి పొందారు. గత నెల 30న జి.విమలమ్మకు గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెం డెంట్‌గా కడప ఆర్‌డీ డా. వై.శ్రీనివాసులు కౌన్సెలింగ్ నిర్వహించి కర్నూలు జీజీహెచ్‌కు పోస్టింగ్ చేశారు. ఈ మేరకు ఆమె పోస్టింగ్ ఆర్డర్స్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రీబాయి అందజేశారు. అనంతరం సూపరింటెండెంట్ ఆమెకు అభినంద నలు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు చేసి ప్రజల నుంచి మన్ననలు పొందాలన్నారు. కల్లూరు మండలం బొల్లవరానికి చెందిన విమలమ్మ 1986లో స్టాఫ్ నర్సుగా, 2013లో హెడ్ నర్సుగా కర్నూలు, అనంతపురం జీజీ హెచ్‌లో పని చేశారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా: సీఐ


మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, సెప్టెంబరు 2: కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లోని రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని సీఐ తబ్రేజ్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వాళ్లనైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అలాగే కోడుమూరు, వర్కూరు, ముడుమలగుర్తి, గోరంట్ల గ్రామాల హంద్రీనదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపితే కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిబంధలకు లోపడి రీచ్‌ల దగ్గర మాత్రమే ఇసుకను తెచ్చుకోవాలని చెప్పారు. నిషేధిత ప్రాంతాలల్లో ఇసుక తవ్వకాలు జరిపితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తామన్నారు. కోడుమూరు ప్రాంతంలో గంజాయి వాడకం ఎక్కువ ఉందని తమ విచారణలో నిర్ధారణ అయిందని, త్వరలో గంజాయిని అరి కడతామని తెలిపారు. కులమతాలకు అతీతంగా గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు.

గ్రీన్‌కోకు భూములు ఇవ్వొద్దు



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

ఓర్వకల్లు, సెప్టెంబరు 2: రైతుల భూములను అక్రమంగా గ్రీన్‌కోకు కట్టబెట్టడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం అన్నారు. సోమ వారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో సన్న, చిన్నకారు రైతుల పొలాలను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఉయ్యాల వాడ గ్రామంలో 1200 రైతు కుటుంబాలు ఉన్నాయని, గ్రామానికి 4వేలకు పైగా ఎకరాల భూమి ఉందని, ఆ భూముల్లో మామిడి, అరటి, పసుపు, కూరగాయలు, ఆకుకూరలు, మొక్కజొన్న తదితర పంటలు పండిస్తున్నారన్నారు. అయితే.. ఈ భూములను సోలార్ పార్కుకు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి: కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: నిర్దేశించిన టార్గెట్ మేరకు గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకం అమలు, పారిశుధ్యం, సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ షెడ్ల నిర్వహణ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయడంలో కర్నూలు జిల్లా వెనుకబడి ఉందన్నారు. కోడుమూరు, సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, ఎమ్మిగనూరు అర్బన్ ప్రాంతాల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి లేదన్నారు. వెల్దుర్తి, క్రిష్ణగిరి, తుగ్గలి, కర్నూలు మండలం, ఆదోని మండలాల్లో ఉపాధి పనులు కల్పించడంలో వెనుకబడి ఉన్నారన్నారు. కుటుంబానికి వంద రోజుల ఉపాధి కల్పనలో జిల్లా 25వ స్థానంలో ఉందన్నారు. జిల్లాలో చేస్తున్న శానిటేషన్, డ్రైనేజీ పనులను చేసిన వెంటనే పీఆర్-1 యాప్‌లో ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు.

'ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి'

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 2: సచివాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా సేవలు అందించాలని నగరపాలక సంస్థ కార్యాలయ మేనేజర్ ఎన్.చిన్నరాముడు సూచించారు. సోమవారం కొత్తపేటలోని 127, 128. 129, 132వ సచివాలయాలను మేనేజర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది పనితీరును మేనేజర్ సమీక్షించారు. సిబ్బంది హాజరు, వినతులు, మూవ్‌మెంట్ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు.

ఉషూ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 2: రాజమండ్రిలో గత నెల 28, 29 తేదీల్లో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో ఆత్మకూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి నాలుగు బంగారు, నాలుగు వెండి, రెండు బ్రౌంజ్ పతకాలు సాధించారు. సోమవారం ప్రిన్సిపాల్ డా.విజయ సిస్టర్ కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఉషూ జిల్లా సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు పాల్గొని విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

గోశాలలో మాజీ ఎమ్మెల్యే కాటసాని పూజలు

కల్లూరు, సెప్టెంబరు 2: కల్లూరు ఎస్టేట్‌లోని రామిరెడ్డితాత గోశాలలో అమావాస్య పూజల్లో భాగంగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గోమాతలకు పూజలు చేశారు. రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ అధ్య క్షుడు దాసరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దాసరి సాయిరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు అఖిల భారత నాతియా ముషాయిరా

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 2: నగరంలోని సెంట్రల్ (మర్కజి) మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి 7 గంటలకు అఖిల భారత నాతియా ముషాయిరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మిలాద్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ ఫీ పాషా ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. పాతనగరంలోని ఉస్మానియా కళాశాల రోడ్డులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో మధ్యప్రదేశ్, ఒడిసా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు మన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఉర్దూ భాషా కవులు పాల్గొంటారని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష

కర్నూలు, సెప్టెంబరు 2: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి కోర్టు జైలు శిక్ష విధించింది. రెండు రోజుల క్రితం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులను కోర్టులో హాజరు పరచగా.. వీరిలో కోర్టు ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

పెద్దాసుపత్రిలో సిమెంటు డస్ట్‌బిన్ల ధ్వంసం

ఎస్పీకి సూపరింటెండెంట్ ఫిర్యాదు


ధ్వంసమైన సిమెంటు చెత్త కుండీ

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు స్వాతంత్ర దినోత్సవం రోజున ఆసుపత్రి సూపరింటెండెట్ డా. ప్రభాకర్‌రెడ్డి సిమెంటు డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ డస్ట్‌బిన్‌లు కొందరు అజ్ఞాత వ్యక్తులు ఎత్తుకెళ్లడం, స్టీల్ డస్ట్‌బిన్ అయితే కోసుకుని పోవడంతో సిమెంటు డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేశారు. ప్రధాన రద్దీ వార్డు దగ్గర వీటిని ఉంచారు. ఆదివారం రాత్రి సర్జికల్ బ్లాక్ సమీపంలోని టీజీ వెంకటేశ్ మినరల్ వాటర్ ప్లాంటు ఎదుట ఉన్న సిమెంటు డస్ట్‌బిన్‌లను రాత్రి ఓ అజ్ఞాత వ్యక్తి సుత్తితో ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి ఆవరణంలో కొందరు అజ్ఞాత వ్యక్తులు పందులను వదిలిపెట్టి వాటికి ఆహారం కోసం సిమెంటు డస్ట్‌బిన్‌లను పగుల కొట్టారు. అలాగే గ్యాస్ట్రో ఎంట్రాలజి వార్డు ఎదుట ఉన్న టీజీ వెంకటేశ్ మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద వేసిన సిమెంటు టెయిల్స్ సిమెంటుతో వేసిన రోడ్డును పందుల కోసం ధ్వంసం చేస్తున్నారు. వీటిని నివారించాల్సిన సెక్యూరిటీ గార్డులు మొద్దు నిద్ర పోతున్నారు. ఘటన జరిగిన రాత్రి పూట డ్యూటీలో ఉండే సెక్యూరిటీ సూపర్‌వైజర్లు సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఎక్స్‌పర్ట్ ఏజెన్సీని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆదేశించారు.

బాధ్యతగా సమస్యలను పరిష్కరించాలి

కమిషనర్ పీవీ రామలింగేశ్వర్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 2: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి సమస్యను బాధ్యతగా పరిష్కరించాలని కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి కమిషనర్ వినతులు స్వీకరించారు. మొత్తం 17 వినతులు వచ్చాయి. టిడ్కో గృహాలకు అనర్హులు కావడంతో గతంలో చెల్లించిన నగదును వెనక్కి ఇవ్వాలని లబ్ధిదారులు కమిషనర్‌ను కోరారు. చెక్‌పోస్టు సమీపంలోని టీచర్స్ కాలనీలో కొందరు రోడ్డును అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని జంపాల మధుసూదనరావు ఫిర్యాదు చేశారు. సోమిశెట్టి నగర్, గౌతమ్ నగర్, నాగంద్ర నగర్, వాసవీ నగర్‌లో రహదారులు, కాలువలు నిర్మించాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, ఆర్‌ఓ జునైద్, మేనేజర్ చిన్నరా ముడు, కార్యదర్శి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, డీసీపీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్: నగరంలోని బి.క్యాంపు, హౌసింగ్‌బోర్డు కాలనీ, సిల్వర్‌జుబ్లీ కళాశాలా, దేవనగర్, బుధవారపేట ప్రాంతాలలో పారిశుధ్య పనులను సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఎప్పటిక ప్పుడు కాలువలను శుభ్రం చేయాలని, వర్షాలు ఎక్కువగా కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కౌతాళం తహసీల్దార్‌పై కేసు నమోదు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: షెడ్యూల్ కులాల చెందిన వ్యక్తికి షెడ్యూల్ తెగల సర్టిఫికెట్ జారీ చేసిన కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామిపై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కౌతాళం రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన నల్లగోడి శ్రీనివాస్‌కు షెడ్యూల్ తెగలకు చెందిన కుల ధ్రువీకరణ పత్రాన్ని కౌతాళం తహసీల్దార్ జారీ చేశారన్నారు. ఇటీవల ఆయన బోగస్ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించిన విషయంలో విద్యాశాఖ అధికారులను సస్పెండ్ చేశారన్నారు. మరలా ఆ వ్యక్తికే షెడ్యూల్ తెగలకు చెందిన కులధ్రువీకరణ పత్రాన్ని కౌతాళం తహసీల్దార్ మంజూరు చేశారన్నారు. దీనికి బాధ్యులైన కౌతాళం తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే


సుంకేసుల డ్యామ్‌ను పరిశీలిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 2: సుంకేసుల డ్యామ్ వద్ద కరకట్ట తెగిపో వడంపై గ్రామస్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వరద ఉధృతి అధికంగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. సోమవారం సుంకేసుల రిజర్వాయర్‌ను పరిశీలించిన ఆయన అక్కడి పరిస్థితులపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకు న్నారు. కరకట్ట కొద్దిగా తెగిపోవడంతో తక్షణమే స్పందించిన అధికారులు వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. వరద ఉధృతికి అనుగుణంగా నీటిని దిగువకు విడుదల చేయాలని ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. టీడీపీ నాయకులు తిమ్మప్ప ఉన్నారు.

గీతాంజలిలో ఫుడ్ మేళా


ఫుడ్ మేళాను ప్రారంభిస్తున్న చైర్మన్ పెరుగు విజయ్‌వర్ధన్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కాలేజీలో ఫుడ్‌మేళా (న్యూట్రిషన్ ప్రోగ్రాం) నిర్వహించారు. సోమవారం కళాశాలలో మొదటి సంవత్సరం బీఎస్సీ నర్సింగ్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మేళాను కళాశాల చైర్మన్ పెరుగు విజయ్‌వర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులు తయారు చేసిన వివిధ వంటకాలను పరిశీలించారు. వంటకాల్లో ఉండాల్సిన పోషక పదార్థాలైన కార్బోహైడ్రేట్స్ కాలరీస్, విటమిన్స్, మాంసకృతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఫుడ్‌మేళాలో తృణ ధాన్యాల ఆవశ్యకతను వివరించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంత కుమారి, క్లాస్ కో ఆర్డినేటర్ ఎస్.సురేఖ, అధ్యాపకులు సింధూజ, కే.సురేఖ, మానస పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

గూడూరు సెప్టెంబరు 2: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ అన్నారు. సోమవారం గూడూరులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అయ్యవారి నాయుడు, చెట్టుకింది నారాయణ, కిశోర్ వర్మ, శేఖర్, హరి పాల్గొన్నారు.

వైభవంగా నందికోల ఉత్సవం

కల్లూరు, సెప్టెంబరు 2: శ్రావణమాసం నాలుగో సోమవారాన్ని పురస్కరించు కుని కల్లూరులోని ఈశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో నందికోలా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు ఈశ్వర, వీరభద్ర స్వామివారికి ఆలయ కమిటీ, ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం మహానైవేద్యం, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్లకు గ్రామోత్సవం చేపట్టారు. జి.చంద్రశేఖరప్ప, పెద్ద లక్ష్మయ్య, మల్లయ్య, శంకరయ్య, పవన్‌కుమార్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కర్నూలు, సెప్టెంబరు 2: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని వన్‌టౌన్ సీఐ రామయ్యనాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. హిందూ, ముస్లింలంతా ఉత్సవాల నిర్వహణకు సహకరించాలన్నారు. పోలీసు మార్గదర్శకా లకు అనుగుణంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్, ఖాన్, పీస్ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి : ఏఐవైఎఫ్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 2: వైద్యం పేరుతో ప్రజల ప్రాణాలు తీస్తున్న డాక్టర్ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబయ్య, బీసన్న మాట్లాడుతూ డాక్టర్ నాగరాజు చిన్న సమస్య వచ్చినప్పటికీ రోగుల నుంచి లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు.

విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

గూడూరు, సెప్టెంబరు 2: వసతి గృహంలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ రామాంజనేయులు వార్డెన్‌కు సూచించారు. సోమవారం తహసీల్దార్ రామాంజనేయులు, మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ గూడూరులోని బాలికల వసతి గృహంను తనిఖీ చేశారు. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వసతి గృహంలో బాలికలు ఏమైనా ఇబ్బందులు పడుతున్నారా అన్నది పరిశీలించారు. అలాగే ఆహారం, బాత్‌రూంలు, గదులు, పరిసరాలను పరిశీలించారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు



చెన్నమ్మసర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 2: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా జనసేన అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు ఆధ్వర్యంలో కల్లూరు చెన్నమ్మసర్కిల్లో నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలకు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరై సంబరాలు జరుపుకున్నారు.

● కల్లూరు మండలం ఉలిందకొండలో టీడీపీ నాయకుడు ఈవీ రమణ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కర్నూలు ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు చింతా సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. రంగస్వామిరెడ్డి, శ్రీకాంత్, షేక్షా, మహేంద్ర, విక్రమ్, రాకేష్, రాజు, కిట్టు పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): గొప్ప మానవతావాది పవన్ కళ్యాణ్ అని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు రూరల్ మండలం పి.రుద్రవరం గ్రామంలో జనసేనా ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం పవన్‌కళ్యాణ్ జన్మదిన పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరై మాట్లాడారు. అనంతరం రక్తదానం చేసిన వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన కోడుమూరు, కర్నూలు ఇన్‌చార్జి ఆకెపోగు రాంబాబు, షేక్ అర్షద్ పాల్గొన్నారు.

విద్యార్థికి ట్యాబ్ అందజేత

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్): ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని శ్రీకృష్ణదేవరాయ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సోమవారం పేద విద్యార్థికి రాయల్ ఆఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన క్యారదర్శి కోనేటి వెంకటేశ్వర్లు సొంత ఖర్చులతో ట్యాబ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ద్వారానే తమలో సామా జిక సేవా దృక్పదం ఏర్పడిందని, దీనిని భవిష్యత్తులో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రోపా ప్రతినిధులు చింతలపల్లి రామకృష్ణ, చంద్రమోహన్, ఆర్జా రామకృష్ణ, ఈశ్వర్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


ట్యాబ్ అందజేస్తున్న రోపా ప్రతినిధులు

సి.బెళగల్: మండల కేంద్రంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల అవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పరిశీలించారు. కార్యక్రమంలో జన సేన మండల నాయకులు ఫరుక్‌బాషా, ఎంపీటీసీ ఈరన్నగౌడు, టీడీపీ మాజీ మండల కన్వీనర్ తిమ్మప్ప, మాజీ ఎంపీటీసీ దనుంజయుడు, గౌస్, బాలజీ వెంకటేశ్, భీమన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు అభిమానులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నన్నూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. హుశేనాపురంలో అభిమానులు మొక్కలు నాటి, 20 కేజీల కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ పుల్లారెడ్డి, వసంతాల శివారెడ్డి, పాణ్యం శ్రీనివా సులు, గడేకల్ చిన్న నారాయణ, కర్నూలు బీఎస్‌ఏ చైర్మన్ భూపతి, రమేష్, సత్యనారాయణ, చందు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో విఫలం

కల్లూరు, సెప్టెంబరు 2: నిత్యావసర ధరలు నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. సోమవారం సీపీఐ నగర కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన కల్లూరు తహసీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాకు గిడ్డయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృషారెడ్డి, మహేష్, నాగరాజు, గిడ్డమ్మ, కే.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉరుకుంద ఈరన్న స్వామికి పూజలు

సి.బెళగల్, సెప్టెంబరు 2: మండలంలోని ఎర్రగుంట కొట్టాల గ్రామంలో వెలసి ఉరుకుంద ఈరన్న స్వామికి సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులు పూజలు చేశారు. గ్రామస్థులు స్వామివారికి కుంకుమార్చన, కాయకర్పూరాలను అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి చిత్రపటాన్ని ఎద్దుల బండిపై ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ పెద్దలు నాగమద్దిలేటి, వర్మ, కుమార్, వెంకటేశ్, మధుకృష్ణ, శేఖర్ భక్తులకు అన్నదానం చేశారు.

నేడు, రేపు తెలుగు అనువాద సాహిత్యంపై సదస్సు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: తెలుగు అనువాద సాహిత్యం-సమాలోచన అనే అంశంపై మంగళ, బుధవారాల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి తెలిపారు. కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు.

నృత్య ప్రదర్శనల్లో విద్యార్థిని ప్రతిభ


మెడల్, ప్రశంసాపత్రాలతో విద్యార్థిని వినయశ్రీ

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 2: ఇంటర్నేషనల్ క్లాసికల్ మ్యూజిషియన్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ (ఐసీఎండీఏ) ఆధ్వర్యంలో, వరల్డ్ రికార్డ్స్ కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి (కాశీ)లో సోమవారం నిర్వహించిన అంత ర్జాతీయ నృత్య ప్రదర్శనల్లో ఉమ్మడి జిల్లా నందికొట్కూరుకు చెందిన విద్యార్థిని అల్లువాల వినయశ్రీ ప్రతిభ చూపి వరల్డ్ రికార్డు మెడల్, ప్రశంసాపత్రాలు అందుకుంది. వారణాసిలో గత రెండు రోజులుగా అంతర్జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఈ ప్రదర్శనల్లో వినయశ్రీ బృందం కూచిపూడి నృత్యాంశంలో 'శివతాండవ స్తోత్రం' అనే అంశంపై ఐసీఎండీఏ తరపున ఈ ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకుంది.

మార్కెట్ యార్డులో చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 2: కర్నూలు మార్కెట్ యార్డులో వ్యాపారులు కూరగాయలను ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండటంతో చెత్తా చెదారం పేరుకుపోయింది. సోమవారం అధికారులు తమ సొంత డబ్బులతో ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగించారు.

ప్రజాధనాన్ని కాపాడాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: మొక్కల పేరుతో జరుగుతున్న నిర్మాణాల అక్రమాలపై విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు వర్మ, మద్దిలేటి పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి


వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న నంద్యాల, కర్నూలు డీసీసీ అధ్యక్షులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 2: దేశం గర్వించదగ్గ మహా నాయకుడు వైఎస్ రాజశేఖరరెడ్డిని డీసీసీ అధ్యక్షుడు కే. బాబురావు అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, మాజీ ఎమ్మె ల్యే మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, షేక్ జిలానీ, అనంత రత్నం మాదిగ, అమనుల్లా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం 21వ వార్డులోని పార్థసారధినగర్ పార్క్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేమని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కొనియాడారు. సోమవారం వైఎస్ వర్ధంతిని పురస్కరించుకుని శరీన్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా కాటసాని నివాళి అర్పించారు.

కర్నూలు(న్యూసిటీ): వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఎస్‌టీబీసీ కూడలిలో నగర మేయర్ బీవై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీ జ్‌ఖాన్‌లు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు విక్రమసింహారెడ్డి, జుబేర్ అహ్మద్, యూనుస్ బాషా, కార్పొరేటర్లు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగనాథగౌడు, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, చంద్రశేఖర్ రెడ్డి, తోట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటరీకరణ తప్పనిసరి

తుగ్గలి, సెప్టెంబరు 2: సొసైటీల రికార్డుల కంప్యూటరీకరణ తప్పనిసరని తహసీల్దార్ నాగరాజు, పత్తికొండ కేడీసీసీబీ చీఫ్ మేనేజర్ సింగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో మారెళ్ల అశోకా సొసైటీ, ఉప్పర్లపల్లి సొసైటీల కంప్యూటరైజేషన్ వివరాలను పరిశీలించారు. మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు, ఉప్పర్లపల్లి సొసైటీ క్లర్క్ నాగరాజు ఉన్నారు.

రంగు మారిన నీరు తాగేదెలా?

హొళగుంద, సెప్టెంబరు 2 : ఎస్ఎస్ ట్యాంక్ నుంచి సరఫరా అవుతున్న రంగు మారిన నీరు ఎలా తాగాలని బీజేపీ నాయకులు చిదానంద ఈడిగ ప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.. అధికారులు స్పందించాలని వారు కోరారు. గజ్జెహళ్లి రామలింగ, మహేష్, చిన్న, గాదిలింగప్ప, వీరేష్ పాల్గొన్నారు.

మట్టిమిద్దెలతో అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, సెప్టెంబరు 2: మట్టిమిద్దెల్లో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలని ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి సూచించారు. సోమవారం మద్దికెరలో పడిపోయిన మట్టిమిద్దెలను పరిశీలించారు.

రాజేంద్ర మృతి బాధాకరం

ఎస్సీ కాలనీలో నివసించే మాజీ డీలర్ పారా రాజేంద్ర మరణం చాలా బాధాకరమని మాజీ ఎంపీపీ మల్లికార్జున యాదవ్, మాజీ సర్పంచ్ కొత్తపేట వెంకటేశ్వరరెడ్డి, వైసీపీ ఉపాధ్యక్షుడు కృష్ణా యాదవ్ అన్నారు. సోమవారం ఆయన భౌతిక కాయానికి నివాళి అర్పించారు. ముస్టూరు రామాంజులు తదితరులు ఉన్నారు.

నష్టాన్ని అంచనా వేయాలి

మద్దికెర, సెప్టెంబరు 2: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా జరిగిన నష్టాలను అంచనా వేయాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో వీఆర్వోలతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచివున్న, మట్టిమిద్దెలు కూలే ప్రమాదం ఉందని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, గ్రామాల్లో నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఆర్ఐ రవికుమార్, వీఆర్వోలు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

నందవరం, సెప్టెంబరు 2: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈవోఆర్డీ ఈశ్వరయ్య తెలిపారు. సోమవారం మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున కాచి, వడపోసిన నీరు తాగాలని దోమలు, ఈగలు ఉండకుండా చూసుకోవాలని కోరారు. శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు.

వర్షాలతో నష్టపోయినవారిని ఆదుకోవాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 2: భారీ వర్షాలతో నష్టపోయినవారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కోడెల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ రైతులు పంటలు నష్టపోయారని తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

వైఎస్ సేవలు మరువలేనివి

ఆదోని టౌన్, సెప్టెంబరు 2: రాష్ట్రానికి వైఎస్ చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దిలీప్ ధోకా అన్నారు. వైయస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, మోహన్ రెడ్డి, శ్రీనిత్, నిసార్ అహ్మద్, రామన్న యాదవ్, మాణిక్యరాజు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: పోస్టాఫీసు వద్ద మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ నివాళి అర్పించారు. ఎంపీపీ నారాయణదాసు, సర్పంచ్ కొమ్ముదీపిక, నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, టైలర్ వెంకటేశ్వరరెడ్డి, వార్డు మెంబర్లు కాలహస్తి సుంకన్న, పాల్‌బాషా, టైలర్ రంగన్న పాల్గొన్నారు.

న్యాయం చేయండి

ఆలూరు, సెప్టెంబరు 2: కార్మిక శాఖ గుర్తింపు పొందిన తమ యూనియన్‌కు మరో యూనియన్ హమాలీలు అడ్డుకుంటున్నారని న్యాయం చేయాలని జై చిరంజీవ హమాలీ సంఘం నాయకులు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యను సోమవారం కోరారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు తలారి రామంజినేయులు, వీరేష్, అంజనేయులు, అంజి, బీ రామంజినేయులు పాల్గొన్నారు.

సచివాలయానికి ఫొటోల అందజేత



సచివాలయ సిబ్బందికి ఫొటోలు అందిస్తున్న నాయకులు

ఆదోని టౌన్, సెప్టెంబరు 2: పట్టణంలోని 19వ వార్డు మండిగిరికి చెందిన సచివాలయంలో ఏర్పాటుకు సీఎం, డిప్యూటీ సీఎం ఫొటోలను టీడీపీ ఇన్‌చార్జ్ శ్రీనివాస ఆచారి, జనసేన నాయకుడు మంజు సోమవారం అందజేశారు. ఫొటోల ఏర్పాటును అధికారులు పట్టించుకోకపోవడంతో తామే ఇచ్చామని అన్నారు. శివ ప్రతాప్, డిష్ రవి, నరేంద్ర, రఘు, శివప్రతాప్, ముని పాల్గొన్నారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2: పట్టణంలోని చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ చేనేత కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి భరణి కాలప్ప డిమాండ్ చేశారు సోమవారం మాట్లాడుతూ ఎన్డీయే ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. విద్యుత్ ఏడీకి వినతి పత్రం అందజేశారు. వెంకటేష్, రాజు, ఎల్లప్ప పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఎల్ఐసీది కీలక పాత్ర

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2 : దేశాభివృద్ధిలో ఎల్ఐసీ పాత్ర ఉందని ఆర్టీసీ డీఎం అమర్నాథ్, బ్రాంచి మేనేజర్ పులినాయక్ జ్యోతి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎల్ఐసీ డే నిర్వహించారు. విజయ్ కుమార్, ఇందిరా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

పెద్దకడుబూరు, సెప్టెంబరు 2: ఆన్‌లైన్‌లో పెండింగ్‌ల ఉన్న రైతుల భూ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు వీరేష్ అన్నారు. సోమవారం తహసీల్దార్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం చేసిన రీ సర్వే తప్పుల తడకగా జరిగిందని ఆరోపించారు. భూమి రిజిస్ట్రేషన్ అయినా ఆన్‌లైన్ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దస్తగిరి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘర్షణ.. కేసు నమోదు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 2: మండలంలోని కడివెళ్లంలో జరిగిన ఘర్షణ విషయంలో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. వివరాల మేరకు.. పోతురాజు ఉసేనమ్మపై అదే గ్రామానికి చెందిన బాబు, నరసన్న, విజయ్, పెద్దయ్య దాడి చేశారు. బాధితురాలు ఉసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమతులు తప్పనిసరి

మద్దికెర, సెప్టెంబరు 2: వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు తప్పక అనుమతి తీసుకోవాలని ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. సోమవారం మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో గణేష్ ఉత్సవ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు పూర్తి చేసిన అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి పొందాలని ఎస్ఐ సూచించారు.

ప్రాణాలు తీస్తున్న వంతెన

- నిలిచిపోయిన హైవే పనులు
- రహదారిని గమనించక పలువురు మృత్యువాత
- హైవే నిర్మాణం ఆగి నీట మునిగిన పొలం
- చేతులెత్తేసిన కాంట్రాక్టర్, పత్తాలేని హైవే అధికారులు



చింతకుంట వాగు వద్ద ఆగిపోయిన వంతెన నిర్మాణం



మెదాహాల్ వద్ద..

వంతెనలు పూర్తి చేయడానికి చర్యలు

ఎన్‌హెచ్-167 పనులు, వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్‌పైకు నోటీసులు జారీ చేశాం. తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూస్తాం.

- శంకర్ రెడ్డి, ఈఈ, నేషనల్ హైవే.

హలహర్వి, సెప్టెంబరు 2: జాతీయ రహదారుల అధికారుల నిర్లక్ష్య వైఖరితో వంతెన నిర్మాణం ఆగిపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కర్ణాటక రాష్ట్రం హగరి నుంచి తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల వరకు నేషనల్ హైవే నెం. 167ను రూపొందించారు. పనులను నాలుగు ప్యాకేజీలుగా విభవించి కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఇక్కడి ప్యాకేజీని ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ దక్కించుకుంది. 70శాతం పనులు పూర్తయ్యాయి అయితే కాంట్రాక్టర్లు మధ్యలోనే చేతులెత్తేశారు.

నిత్యం ప్రమాదాలు

చింతకుంట, మెదాహాల్ వద్ద వంతెన నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో పాటు చింతకుంట వద్ద సైతం వంతెన పూర్తి కాకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రహదారి విషయం గమనించని వాహనదారులు వేగంగా వచ్చి మృత్యువాత పడుతున్నారు. సరైన సూచిక బోర్డులు కూడా ఏర్పాటుచేయకపోవడంతో ప్రయాణికులు మృత్యువాత పడుతున్నారు. ఆరు నెలల క్రితం పావురాలు కోసం వచ్చిన నలుగురు యువకులు ప్రమాదంలో మృతి చెందారు. కర్ణాటకకు చెందిన ఓ కారు వేగంగా వచ్చి ప్రమాదానికి గురై, ఇరువురు మహిళలు, చిన్నారి మృతి చెందగా బైక్ అదుపు తప్పి మరొకరు మృత్యువాత పడ్డారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎన్నో సంఘటనలతో ఎంతో మంది బలి అయ్యారు. ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంతో వణికిపోతున్నారు.

కొట్టుకుపోయిన పొలం

మేదహాల్ గ్రామానికి చెందిన రైతు పేరు హరినాథ్ రెడ్డికి రహదారి పక్కనే 8 ఎకరాల పొలం ఉంది. వంతెన నిర్మాణం కోసం వాగును తవ్వేసి, సరైన విధంగా ముగించకపోవడంతో నీరంతా పొలంలో ప్రవహిస్తున్నది. దీంతో రైతు వ్యవసాయం చేసుకోలేని స్థితిలో ఉన్నాడు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 2 : సీపీఎం, జీపీఎస్, యూపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం పెన్షన్ విద్రోహ దినోత్సవంలో భాగంగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. జయరాం, చంద్రశేఖర్, రాము, లక్ష్మన్న, రామస్వామి, రామన్న రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్న ఎంఈఓలు : యూటీఎఫ్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 2: ప్రభుత్వ ఉత్తర్వులను ఎంఈఓలు అంజనేయులు, మధుసూదన్ రాజ బేఖాతరు చేస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు నాగమణి, యల్లప్ప, దావీదు, నవరసింహులు, దేవపాల్ ఆరోపించారు. ఎంఈఓల వైఖరిని నిరసిస్తూ సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. పని సర్దుబాటు ఉత్తర్వుల ప్రకారం మండలంలో ఆగస్టు 17న కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా ఏకపక్షంగా ఓ ఉపాధ్యాయుడికి సంతనాగలాపురానికి పోస్టింగ్ ఇచ్చి డీఈవోకు సమర్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కౌన్సిలింగ్ రోజు ఎంఈఓ అంజనేయులు సెలవులో ఉన్నారని, సదరు ఉపాధ్యాయుడు కౌన్సిలింగ్‌కు హాజరు కాలేదని డీఈఓకు ఎలా రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. ఎంఈఓ -2 మధుసూదన్ సమాచారం ఉపాధ్యాయుడిని ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలన్న, రామాంజనేయులు, మల్లారి నాగరాజు, అల్లాబకాష్, సుధాకర్, ప్రశాంత్, భూపాల్, సంపత్ కుమార్, మాధన్న, భాస్క ర్, బాబు, ఎల్లప్ప, పెద్దారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తూ...

- ఇన్‌చార్జి డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

ఆదోని, సెప్టెంబరు 2: ప్రజా సమ్యలను వేగంగా పరిష్కరించాలని ఇన్‌చార్జి డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ దేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం గ్రీవెన్స్‌డేలో ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆదోని మండలం దొడ్డనకేరి గ్రామానికి చెందిన బీ ఫహద్ తన పొలంలో సర్వే చేయించాలని కోరారు. 15వ వార్డు వైఎంకె నగర్‌లో తాగునీరు రావడంలేదని లక్ష్మీ, అసియా, నాగమ్మ, అర్జీ సమర్పించారు. డ్రైనేజీపై ఇళ్ల కట్టంతో మురుగు రోడ్డు పై ప్రవహిస్తోందని కట్టడాలను తొలగించాలని గనేకల్‌కు చెందిన తాయప్ప, వీరస్వామి రామాంజినేయులు, ఉచ్చిరప్ప అర్జీ సమర్పించగా మండిగిరికి చెందిన మరాఠ నరసింహులు తనకు 4.50 ఎకరాలుండగా 1.50 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో ఉందని మిగిలిన 3 ఎకరాలను నమోదు చేయాలని కోరారు. ఏవో వసుంధర, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే యర్ వేణు సూర్య శ్రీనివాస రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డీఎల్పీవో నూర్జహాన్, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, గృహ నిర్మాణ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, డీటీ పెద్దయ్య, వలిబాష పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తరలించాలి

ఆదోని (అగ్రికల్చర్): పట్టణ శివారులోని శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ వసతి గృహాన్ని తరలించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. వర్షాలతో భవనం కూలిపోయేలా ఉందని అన్నారు. సూరి, గౌస్, దేవరాజు, యశ్వంత్, ప్రతాప్ రాజు పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి: డీఎస్పీ



మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య

ఆలూరు, సెప్టెంబరు 2: వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అన్ని మతాలు, పెద్దలు సహకరించాలని పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య కోరారు. సోమవారం ఆలూరు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ వెంకట నరసింహు లు ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వ హించారు. విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండోలో ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని నిమ జ్జనం సాయంత్రంలోగా పూర్తయ్యేలా చూసుకోవా లని అన్నారు.. సీఐ శ్రీనివాస నాయక్, హలహర్వి ఎస్సై చంద్ర, తహసీల్దార్ గోవింద్ సింగ్, ఎంపీడీవో అల్లా బకాష్, మత పెద్దలు పాల్గొన్నారు.

నాడు-నేడుపై విచారణ చేయాలి

మంత్రాలయం, సెప్టెంబరు 2: మండలంలోని చిలకలడోన ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులపై విచారణ జరపాలని ఆదోని సబ్ కలెక్టర్ చల్లా విశ్వనాథ్‌కు ఆర్‌యుఎస్ఎఫ్, ఆర్‌పీఎస్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. సోమవారం ఆదోనిలో ఆ సంఘాల నాయకులు రఘునాథ్, ఆఫ్రీదీలు మాట్లాడుతూ పాఠశాల హెచ్‌ఎం సరళాదేవి, నాడు-నేడు పనుల్లో అవినీతికి పాల్పడ్డారని పనుల్లో నాణ్యత లోపించిందని, రూ.32 లక్షలు పాఠశాల అకౌంటుకు జమ కాగా, రూ.4 లక్షలు అదనంగా తీసుకుని నాసిరకం పనులు చేంశారని అన్నారు. విద్యాకమిటి ఛైర్మన్ సంతకాలు లేకుండా డబ్బులను ఏ విదంగా విత్‌డ్రా చేస్తారని ఆరోపించారు. హెచ్‌ఎం, కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నవీన్, సతీష్, ప్రకాష్, అశోక్‌లు పాల్గొన్నారు.

మార్కెట్‌లో జనరేటర్ ఏర్పాటుకు ప్రతిపాదన



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

- రైతుల కోసం టార్పాలిన్లు తెప్పిస్తున్నాం: జేడీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 2: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రూ. 25లక్షలతో జనరేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నా మని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. సోమవారం వ్యవసాయ మార్కెట్ యార్డును పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు జనరేటర్ అవసరమని కోరడంతో ప్రతిపాదనలు పంపించామని, మంజూరైన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. వేరుశనగ, ఇతర పంట ఉత్పత్తులు వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కర్నూలు మార్కెట్‌నుంచి 50 తెప్పించామని, డీసీఎంఎస్‌నుంచి 100 కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అలాగే మరిన్ని అవసరమైతే ఆదోని మార్కెట్‌నుంచి తెప్పించుకోవాలని కార్యదర్శికి సూచించారు. కూరగాయల క్రయవిక్రయాల దుకాణాలకు ప్రత్యామ్నాయంగా వేరోచోట ఏర్పాటు చేసి అక్కడ పత్తి, వరి క్రయవిక్రయాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఏడీఎం నారాయణ మూర్తి, కార్యదర్శి పద్మావతి, సిబ్బంది ఉన్నారు.

సాయం చేయడమే టీడీపీ లక్ష్యం



పింఛన్ పంపిణీ చేస్తున్న నాయకుడు

నందవరం, సెప్టెంబరు 2: పేదలకు సాయం చేయడమే టీడీపీ లక్ష్యమని బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ముగతి ఈరన్నగౌడ్ అన్నారు. సోమవారం ముగతి గ్రామంలో కిడ్నీ డయాలసిస్ రోగి గొల్ల వెంకటేష్‌కు ఎ మంజూరైన రూ.10వేల పింఛన్‌ను అందజేశారు. బార్గవ్ యాదవ్, రామకృష్ణ, నాగరాజు, దనుంజయ్ పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

మంత్రాలయం, సెప్టెంబరు 2: శ్రీమఠంలో అన్నదానికి అమెరికాకు చెందిన భక్తుడు రవిబాలాజీ రూ. లక్ష విరాళం ఇచ్చినట్లు మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి తెలిపారు. సోమవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారని అన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబర్ 2: మండలంలోని గుడికల్లు గ్రామ సమీపంలో ఉన్న శ్రీరామ నగర్ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీసీ విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయ కులు నరసన్న, వీరేష్, వెంకటేష్‌లు కోరారు. సోమవారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు





దేవనకొండ: టమోటటను పరిశీలిస్తున్నశాస్త్రవేత్తలు, పత్తికొండ మండలంలో..

దేవనకొండ, సెప్టెంబరు 2: అలారుదిన్నె గ్రామంలో ముంపునకు గురైన పత్తి, టమోట పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుజాత, కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి డైరక్టర్ రాఘవేంద్ర పరిశీలించారు. పత్తి ముంపుకు గురైతే పిందెలు, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారి పడిపోతా యని అన్నారు. పోటాషియం నైట్రేట్, యూరియా వ్యవసాయాధికారుల సలహా మేరకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. టమోటకు బ్యాక్టీరియా స్పాట్ తెగులు కనిపించిందన్నారు. నివారణకు ఆక్సిక్లోరైడ్, కసుగా మైసిన్‌లాంటి మందులును పిచికారీ చేయాలన్నారు. ఏవో సురేష్‌బాబు, ఎఈవో జయరాం ఉన్నారు.

పత్తికొండ టౌన్: మండలంలోలోని పొలాలను శాస్త్రవేత్త సుజాతమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఏవో వెంకట్రాముడు పంట పొలాలను పరిశీలించారు. జూటూరు, చిన్నహుల్తి, పెద్దహుల్తి గ్రామాల్లో పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించే చర్యలు గురించి, అలాగే రసాయనిక మందులు పిచికారీ, పంటలను కాపాడుకునే విధానంపై రైతులకు వారు పలు సూచనలు చేశారు.

నీటమునిగి కుళ్లిన పంటలు

తుగ్గలి, సెప్టెంబరు 2: భారీ వర్షాలకు పంటలు నీటమునిగి కుళ్లిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్‌లో దాదాపు 22,913 ఎకరాలు సాగు చేశారు. భారీ వర్షాలకు పగిడిరాయిలో దాదాపు 300 ఎకరాల్లో కంది, మిరప, వేరుశనగ పంటలు నీట మునగగా, జొన్నగిరిలో 50ఎకరాల్లో కంది, పత్తి, ఆముదం పంటలలు నీటమునిగాయి.

కంది కుళ్లిపోయింది: ఎనిమిదెకరాల్లో కంది సాగు చేస్తే నాలుగెకరాలు పంట నీటమునిగి కుళ్లిపోయింది.





జొన్నగిరిలో కుళ్లిపోయిన కందిపంట

రూ.1.60 లక్షల పెట్టుబ డి నీటిపాలైంది. ప్రభుత్వం ఆదుకోవాలి **- సోమశేఖర్ రెడ్డి, జొన్నగిరి**

డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు



మొక్కలు నాటుతున్న మీనాక్షి నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి, మల్లప్ప

ఆదోని, సెప్టెంబరు 2: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం జనసేన ఇన్‌చార్జి మల్లప్ప ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి, డీఎస్పీ సోమన్న, బీజేపీ నాయకులు విట్టా రమేష్, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. మల్లప్ప మాట్లాడుతూ రాజకీయాల్లో పవన్ కళ్యాణ్ మేధవుల సూచనలు పాటించారని అన్నారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, బుద్ధారెడ్డి, గోపాల్ రెడ్డి, లక్ష్మీ నారాయణ జనసేన నాయకులు రేణువర్మ, మహేష్, వెంకటరాముడు, చిరుత రాజశేఖర్, పులిరాజు, శ్రీనివాసులు, బీజేపీ కార్యకర్తలు నాగరాజు గౌడ్, శ్రీనివాస ఆచారి, తాయన్న పాల్గొన్నారు.

వెల్దుర్తి: టీడీపీ నాయకులు మండల అధ్యక్షుడు బలరాంగౌడు, రమాకాంత్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈదుల వెంకటరాముడుపాల్గొన్నారు.

తుగ్గలి: క్రాంతి కుమార్ జయంత్, కరుణాకర్, రాజేష్ పాల్గొన్నారు.

దేవనకొండ: జగదీష్, మగ్బుల్, ఉచ్చీరప్ప, రామాంజినేయులు, బాలకృష్ణ, రంగస్వామి పాల్గొన్నారు.

కోసిగి: బి.లక్ష్మన్న,ఈరారెడ్డి, చిన్న టీడీపీ నాయకులు ఎస్.రామకృష్ణారెడ్డి, ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, నరవ రమాకాంత్‌రెడ్డి, టీడీపీ కన్వీనర్లు జ్ఞానేష్, బసలదొడ్డి ఉన్నారు.

ఆస్పరి: విరుపాక్షి, రాజశేఖర్, శంకయ్యస్వామి వెంకప్ప, అరవింద్ యాదవ్ పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఇన్‌చార్జి రేఖగౌడ్, సర్పంచ్ హైమావతి, షేక్షావలి, గానుగబాషా పాల్గొన్నారు.

కౌతాళం: రాకేష్‌రెడ్డి, సతీష్‌నాయుడు, వెంకటపతి రాజు, రాంబాబు, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: నాగరాజు, దామోదర్‌రెడ్డి, పృధ్వి కార్తిక్, కల్యాణ్; నరసింహులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: సోమరాజు, రవి, తిరుమలేశ్, మాలిక్, జాకీర్, షఫి, కళ్యాణ్, అరవింద్, రమణ, మధు, రాజేశ్, చందు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: రాజశేఖర్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు

ఆలూరు: జనసేన ఇన్‌చార్జ్ వెంకప్ప రంజిత్, శేఖర్, మునీర్, యశోద్, సద్దాం, రంగస్వామి, మున్న పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ప్రభుత్వ వైద్యులు డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో మాత శిశు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు

హొళగుంద: జనసేన నాయకుడు వెంకప్ప వేడుకలు నిర్వహించారు

ఆశా వర్కర్ల ఆందోళన



ధర్నా చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 2: తమ డిమాండ్లను నెరవేరుస్తామన్న హామీని వెంటనే అమలు చేయాలని ఆశావర్కర్లు ఆందోళన చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి, సీఐటీయూ కార్యదర్శి రాముడు అన్నారు. రాధిక, శాంతి, రేణుక పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

దేవనకొండ, సెప్టెంబరు 2 : వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి నర్సారావ్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో సమస్యలు తిష్టవేశాయని, అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఎంపీడీ వోకు వినతిపత్రం ఇచ్చారు. వీరాంజనేయులు, బాషా, సుల్తాన్ పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 2: ఎసీ వ్యక్తికి ఎస్టీ సర్టిఫికెట్ జారీ చేసిన కౌతాళం తహసీల్దార్ మల్లికార్జున స్వామిపై కేసు నమోదు చేయాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌కు ఎస్టీ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారని, విచారణ అనంతరం ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారన్నారు. అదే వ్యక్తి ఎస్టీ ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారని కౌతాళం తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోను సస్పెండ్ చేయాలని కోరారు.

శాంతియుతంగా గణేశ్ ఉత్సవాలు జరుపుకోవాలి

చిప్పగిరి, సెప్టెంబరు 2: గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రమేష్ బాబు అన్నారు. సోమవారం దౌల్తాపురం టీడీపీ నాయకులు హరినాథ్, చిరంజీవి, బాలమురలి, రాముడు, హనుమేష్, ధనుంజయ ఎస్ఐని సన్మానించారు.

బసవేశ్వర స్వామి రథోత్సవం

ఆదోని రూరల్, సెప్టెంబరు 2: ఇస్వి గ్రామంలో జోడు బసవేశ్వర స్వామి రథోత్సవం సోమవారం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి వేద పండితులు జోడు బసవేశ్వరస్వాములకు పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని లాగారు ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొన్నారు.

కర్ణాటక వాసి అరెస్టు

ఆదోని రూరల్, సెప్టెంబరు 2: బళ్ళారి జిల్లా శిరుగుప్ప తాలుక నాగరహళ్ళి గ్రామానికి చెందిన జింగిల్‌సాబ్‌ను ఇస్వీ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాల మేరకు.. బైక్‌పై కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా మదిరె క్రాస్ వద్ద అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 200 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసకునానరు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయులు

మంత్రాలయం, సెప్టెంబరు 2. మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథం పై దర్శనం ఇచ్చారు. సోమవారం అమావాస్య సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలరాములకు, జయరాములు, దిగ్విజయరాము లకు కనకాభిషేకం చేశారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్టించి ఊరేగించారు.